

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్
జిల్లా వార్తలు
3
సోమవారం 8 ఏప్రిల్ 2024



రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:29 సోమవారం
సహర్ 4:35 మంగళవారం

నేతన్నలకు చేయూతనివ్వాలి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 7: రాష్ట్రంలోని చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించడంతోపాటు వారికి చేయూత నివ్వాలని చేనేత ఐక్య వేదిక రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈమేరకు ఆదివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని చేనేత ఐక్య వేదిక అధ్యక్షుడు రాపోలు వీరమోహన్, రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షుడు కోమటిపల్లి సదానందం కలిసి వినతిపత్రం సమర్పించారు. చేనేత కార్మికులకు రుణాలు ఇవ్వాలని, సబ్సిడీపై నూలు, రంగులు అందించాలని కోరారు.





'సన్'డే



- వామ్మో ఇవేమీ ఎండలు
- 44 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు
- జిల్లా అంతటా ఆరెంజ్ అలర్ట్
- ఉక్కిరిబిక్కిరి అవుతున్న జనం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 7: వామ్మో... ఇవేమి ఎండలు... ఇప్పుడే ఇలా ఉంటే ఇంకా ఏప్రిల్ నెలఖారు, మే, జూన్ మొదటి వారం వరకు ఎండలు ఎలా ఉంటాయోనంటూ జనం బెంబేలెత్తిపోతున్నాయి... బయట నిప్పులు చెరుగుతున్న సూర్యుడు... ఇంట్లో ఉంటే భరించలేని ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఆదివారం సూర్యుడు తన ప్రతాపాన్ని చూపించారు. జిల్లా అంతటా 40 డిగ్రీలకు పైన ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో వాతావరణశాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. జిల్లాలో అత్యధికంగా వీణవంక మండలకేంద్రంలో 44 డిగ్రీలు, జమ్మికుంట మండలలం కొత్తపల్లి-ధర్మారంలో 43.8, జమ్మికుంట పట్టణంలో 43.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. శంకరపట్నం మండలం కొత్తగట్టులో 43.6, చొప్పదండి మండలం వెదురుగట్టలో 42.9, ఇల్లందకుంట మండలం మల్యాలలో 42.6, చిగురుమామిడి మండలం ఇందుర్తిలో 42.5, చొప్పదండి మండలం ఆర్నకొండలో 42.4, కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్‌లో 42.1, ఆసిఫ్‌నగర్‌లో 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 6 గంటల నుంచే తీవ్రంగా ఉక్కపోత ఉంటుంది. మధ్యాహ్నం వేళల్లో ప్రజలు బయటకు రావడం లేదు. నిత్యం రద్దీగా ఉండే జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారులతోపాటు ముఖ్యకూడళ్లు జనం లేక వెలవెల బోతున్నాయి. జంతువులు, పక్షులు, మూగజీవాలు ఎండ వేడిమిని తట్టుకోలేక విలవిలలాడుతున్నాయి. వృద్ధులు, చిన్నపిల్లలు, వ్యాధిగ్రస్తులు వేడిమిని భరించ లేక ఇబ్బంది పడుతున్నారు. ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు కూడా పనిచేయడం లేదని, ఇంట్లో ఉండలేక పోతున్నామని, రాత్రి 11 గంటల వరకుకూడా వేడి గాలులు వీస్తున్నాయని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెక్కాడితేకానీ డొక్కాడని కూలీలు, ఆటోలు, రిక్షా కార్మికులు, వీధివ్యాపారులు, చిరువ్యాపారులు బతుకుబండిని లాగేదెట్లా అంటూ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎండల తీవ్రత గత ఏడాదితో పోల్చితే ఈయేడు 5 డిగ్రీల వరకు పెరిగినందున అత్యవసరమైతే తప్పా ఇళ్ల నుండి ఉదయం 10 తర్వాత బయటకు రావద్దంటూ డాక్టర్లు సూచిస్తున్నారు.

ఎన్నికలు రాగానే రైతులు గుర్తొచ్చారా?

- బీఆర్ఎస్ దొంగదీక్షలు, కపటప్రేమలు మానుకోవాలి
- బండి సంజయ్ చేసిన అభివృద్ధిపై శ్వేపత్రం విడుదల చేయాలి
- మానకొండూర్ ఎమ్మెల్యే డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 7: అధికారం కోల్పోగానే మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ నాయకులకు హఠాత్తుగా రైతులు గుర్తుకు వచ్చారా అని మానకొండూర్ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ ప్రశ్నిచారు. జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో కలిసి ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ ప్రగతి భవన్, ఫాంహౌస్‌కే పరిమితమై రైతులు, సామాన్య ప్రజలకు కలిసే అవకాశమే ఇవ్వకుండా రాచరికపు పాలన సాగించారన్నారు. ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టంతో ప్రస్తుతం అధికారం కోల్పోగానే రైతులు, పంట పొలాలు గుర్తుకు వస్తున్నాయని ఎద్దేవా చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరితే 2017లో రైతులకు బేడీలు వేసి, ఇప్పుడు రైతు దీక్షల పేరుతో మొసలి కన్నీరు కారిస్తే ఎవ్వరూ నమ్మరన్నారు. గత సంవత్సరం కురిసిన అకాల వర్షాలకు నిజామాబాద్, కామారెడ్డి, సిరిసిల్ల జిల్లాల్లో దాదాపు 20 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఎకరాకు 10 వేలు సహాయం చేస్తామన్నారు. పంటన నష్టపోయిన రైతులకు 10 రోజుల్లో పరిహారం ఇస్తామని అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటించి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గడిచిన మూడు నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా వైద్య ఖర్చుల కోసం లక్షల రూపాయల ఎల్‌వోసీ పొందిన రోగుల వివరాలను, ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పొందిన విద్యార్థుల వివరాలు ఇస్తామన్నారు. ఈ విషయంలో ప్రభుత్వంపై కేసీఆర్ చేసిన ఆరోపణలపై పత్రికా ముఖంగా క్షమాపణలు చెప్పాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ డిమాండ్ చేశారు. రాముడి పేరుతో రాజకీయాలు చేస్తున్న బీజేపీ నేత బండి సంజయ్ నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధి కోసం కేంద్రం నుంచి ఎన్ని నిధులు తెచ్చారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థిని త్వరలోనే అధిష్ఠానం నిర్ణయిస్తుందని, అభ్యర్థి గెలుపునకు అందరూ కట్టుబడి ఉంటామన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కి ఓటు వేసి ప్రజా స్వామ్యాన్ని కాపాడాలని ప్రజలను కోరారు. సమావేశంలో అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి, మానకొండూరు నియోజకవర్గ సమన్వయకర్త మల్యాల సుజిత్ కుమార్, నాయకులు పులి ఆంజనేయులు గౌడ్, పడాల రాహుల్ పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలతో ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్

- ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్



కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ నేతల భేటీలో మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, ఏప్రిల్ 7: కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలతో ప్రజలను మోసం చేస్తోందని ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం నగరంలో నిర్వహించిన కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చేసిన మోసాలను ఇంటిటికీ వెళ్లి వివరించాలన్నారు. ఆరు గ్యారెంటీలపై కాంగ్రెస్ చేస్తున్న జిమ్మిక్కులను ప్రజలకు తెలియజేయాలన్నారు. నేతన్నలకు మద్దతుగా ఈ నెల 10న సిరిసిల్లలో నిర్వహించే దీక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రంలో నేతన్నల పరిస్థితి దుర్భరంగా మారిందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకులు చేసిన మోసాలతో నాలుగు నెలలుగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ మూతపడిందని విమర్శించారు. నేతన్నలు రోడ్డున పడ్డారని, పాలకుల నిర్లక్ష్యం వల్ల తినడానికి తిండిలేక నేతన్నలు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. నేతన్నలను ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో ఈ నెల 10న దీక్ష చేడుతున్నామన్నారు. ప్రతి ఓటరును కనీసం ఐదు సార్లు కలిసి బీజేపీకి ఓటేయాలని కోరాలని సూచించారు. సమావేశంలో పార్లమెంట్ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి అభయ్ పాటిల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ప్రేమేందర్‌రెడ్డి, దుగ్యాల ప్రదీప్‌కుమార్, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, ప్రతాప రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, రాష్ట్ర కార్యదర్శి జయశ్రీ, జిల్లా ఇన్‌చార్జి మీసాల చంద్రయ్య, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర నాయకులు చెన్నమనేని వికాస్‌రావు, డి శంకర్ పాల్గొన్నారు.

నెల రోజుల్లో పార్టీ పరంగా ముమ్మర కార్యక్రమాలు

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ప్రేమేందర్‌రెడ్డి

రాబోయే నెల రోజుల్లో పార్టీపరంగా ముమ్మర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర రాష్ట్రప్రధాన కార్యదర్శి జి ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. మే 1 నుంచి 5 వరకు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 100 స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించాలని నాయకత్వం ఆదేశించిందన్నారు. ఈ నెల15 నుండి 18 వరకు అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఏప్రిల్ 30న వివిధ మోర్చాల నాయకులతో సమావేశం ఉంటుందని తెలిపారు. 18 నుంచి 23 సంవత్సరాలు ఉన్న యువ ఓటర్లు అత్యంత కీలకమని, వీరితో మండలాల వారీగా సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ప్రతి పోలింగ్ బూత్‌లో గతంలో వచ్చిన ఓట్ల కంటే అదనంగా 370 ఓట్లు సాధించడమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు.

రాష్ట్రంలో బీజేపీకి పదికంటే ఎక్కువ సీట్లు

- పార్లమెంట్ ఎన్నికల రాష్ట్ర ఇన్‌చార్జి అభయ్ పాటిల్

భగత్‌నగర్: రాష్ట్రంలో బీజేపీకి పది స్థానాలకంటే ఎక్కువ సీట్లు వస్తాయని ఆ పార్టీ పార్లమెంట్ ఎన్నికల రాష్ట్ర ఇన్‌చార్జి అభయ్ పాటిల్ అన్నారు. ఆదివారం నగరంలో పార్లమెంట్ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ అంతర్గత సమావేశం కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బండి సంజయ్ గాలి వీస్తున్నదన్నారు. కరీంనగర్‌లో గతంలోకంటే రెట్టింపు మెజారిటీతో గెలవబోతున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో సభలు, సమావేశాలు, కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేశారు. సోషల్ మీడియాను విస్తృతంగా ఉపయోగించుకోవాలన్నారు. సామాజిక వర్గాల వారీగా సమావేశాలు నిర్వహించాలని, ఆత్మీయ సమ్మేళనాలు, మహిళా కార్మికసంఘాల సమావేశాలు నిర్వహించాలన్నారు. పోలింగ్‌బూత్ శక్తి కేంద్రాల అధ్యక్షుల పాత్ర కీలకమన్నారు. అన్ని సర్వేలు బీజేపీకి అనుకూలంగా ఉన్నాయన్నారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటేసిన ప్రజలంతా ప్రత్యామ్నాయపార్టీల వైపు చూస్తున్నారన్నారు.

ప్రజాపాలన పేరుతో ప్రతీకార పాలన

- ఆరుగ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్
- సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో బీఆర్ఎస్‌నేతలపై అక్రమ కేసులు
- బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 7: రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాపాలన పేరుతో ప్రతీకార పాలన సాగిస్తున్నారని భారత రాష్ట్ర సమితి నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. ఆదివారం కరీంనగర్‌లో నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల యుద్ధభేరి సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తుక్కుగూడ వేదికగా ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్ వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు దండుకునేందుకు మళ్లీ అదే తుక్కుగూడ వేదికగా బహిరంగ సభను నిర్వహించి కల్ల బొల్లి హామీలను ప్రకటించారని విమర్శించారు. ఇప్పుడు కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కరీంనగర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో బీఆర్ఎస్ నాయకులపై పోలీసులు అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. అక్రమ కేసులకు భయపడకుండా ధైర్యంగా ఎదుర్కొని దోపిడీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు నాయకులు, కార్యకర్తలు పోరాడాలని పిలుపునిచ్చారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలు వంద రోజుల అబద్ధాల కాంగ్రెస్ ప్రభుత్వం, పదేళ్ల నిజమైన బీఆర్ఎస్ పాలన మధ్య జరుగుతు న్నాయని తెలిపారు. రాష్ట్రంలో కరువు ఏర్పడి పంటలు ఎండిపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకునే పాపాన పోవ డం లేదని విమర్శించారు. శ్వేతపత్రాల పేరుతో బీఆర్ఎస్‌ను బద్నాం చేసే కుట్రలను కాంగ్రెస్ చేస్తోంది తప్ప ప్రజా సమస్యలను ఏమాత్రం పరిష్కరించడం లేదన్నారు. మళ్లీ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేసి మనుస్మృతి ఆధారంగా అలహా బాద్‌లో కొంత మంది హిందుత్వవాదులు రాసిన హిందు త్వ రాజ్యాంగాన్ని అమలు చేస్తుందన్నారు. రాజ్యాంగం రద్దయితే హక్కులు కోల్పోతామని తెలిపారు. రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. జెండా మారినా.. తన ఏజెండా పేద ప్రజల పక్షమేనని ప్రవీణ్‌కుమార్ స్పష్టం చేశారు. మసీదులు తవ్వే నాయకులు కావాలో, ప్రజా సమస్యలపై గళమెత్తే నాయకులను గెలిపించాలో ఓటర్లు తేల్చుకోవాలన్నారు. కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

వినోద్‌కుమార్ కృషితోనే స్మార్ట్ సిటీ

అనాటి ఎంపీ వినోద్‌కుమార్ కృషితోనే కరీంనగర్ స్మార్ట్‌సిటీగా ఎంపికైందని, ఆయనను ఎంపీగా గెలిపిస్తేనే అభివృద్ధి మరింత వేగంగా ముందుకు సాగుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఏనాడూ ప్రజలను పట్టించుకోలేదని విమర్శించారు. బి వినోద్‌కుమార్ మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌నాయకత్వాన్ని ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారని అన్నారు. 24 గంటల విద్యుత్‌ను అందించిన ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. ఆంధ్రాపాలనలో కరువుతో అల్లాడిన తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి కోటి ఎకరాలకు సాగునీరు అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదని తెలిపారు. తెలంగాణ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని అన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, నాయకులు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ పాల్గొన్నారు.

బీజేపీతో దేశ సమైక్యతకు పెను ప్రమాదం

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జె వెంకటేశ్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కమిటీ సభ్యుడు జె వెంకటేశ్

భగత్‌నగర్, ఏప్రిల్ 7: బీజేపీతో దేశ సమైక్యతను పెను ప్రమాద మని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జె వెంకటేష్ అన్నారు. ఆదివారం నగరంలోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో సీపీఎం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లా డుతూ పది సంవత్సరాలుగా అధికా రంలో ఉన్న బీజేపీ దేశ సమైక్యతకు సమగ్రతకు విఘాతం కలిగించే విధంగా మతోన్మాదాన్ని పెంచి పోషించిందన్నారు. నిత్యావసర వస్తు వుల ధరలు పెంచుతూ పేద, మధ్య తరగతి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పోరేట్ శక్తులకు ధారదత్తం చేసిందని విమర్శించారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు అని యువతను మోసం చేసిందన్నారు. సీపీఎం తెలంగాణ రాష్ట్రంలో భువనగిరిలో పోటీ చేస్తోందని, మిగతా చోట్ల ఇండియా కూటమికి మద్దతు ఇస్తుందని తెలిపారు. ఈ నెల 17 వరకు బీజేపీ వైఖరిని ఎండగడుతూ జిల్లా వ్యాప్తంగా వామపక్షాల ఆధ్వర్యంలో జిల్లా సదస్సులు, బహిరంగ సభలు నిర్వహిస్తామన్నారు. కరీంనగర్‌లో ఎంపీ బండి సంజయ్ అభివృద్ధి చేయకుండా మతకల్లోలాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, గీట్ల ముకుంద రెడ్డి, గుడికందుల సత్యం, భీమాసాహెబ్, శ్రీనివాస్, సుంకరి సంపత్, ఎడ్లరమేష్, వెలమారెడ్డి రాజిరెడ్డి, జి రాజేశం, నరేష్ పటేల్, మక్కపల్లి పూజ పాల్గొన్నారు.

చల్లంగ చూడు పోచమ్మ తల్లి...

సైదాపూర్, ఏప్రిల్ 7: మండలంలోని సర్వాయిపేట గ్రామ పంచాయతీ పరిధిలో గల శివరాంపల్లి గ్రామంలో గ్రామస్థులు పోచమ్మ బోనాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. కొత్తగా పోచమ్మ దేవాలయం నిర్మించి, పోచమ్మ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించి, ఆదివారం బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి బోనంతో మహిళలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. చల్లంగ చూడు తల్లి అని వేడుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జల్ల మల్లేష్, గ్రామస్తులు పెసరు శ్రీనివాస్, మాదం స్వామి, అయిలయ్య, ప్రవీణ్, అమృత్ సింగ్, శ్రీధర్, మహేష్, రమేష్, రాజయ్య, ప్రశాంత్ , తిరుపతి, శ్రీనివాస్ మహిళలు పాల్గొన్నారు.



సైదాపూర్ మండలం శివరాంపల్లిలో బోనాలతో ఊరేగిపుగా వెళ్తున్న మహిళలు

- **మానకొండూర్:** ఉగాది పండుగను పురస్కరించుకొని మండలంలోని వివిధ గ్రామాలలో ఆదివారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. మానకొండూర్, అన్నారం, చెంజర్ల, గట్టుదుద్దెనపల్లి, పచ్చునూర్, ఊటూర్, వేగురుపల్లి, వెల్ది, లింగాపూర్, రంగపేట, లలితాపూర్, పోచంపల్లి, కెల్లేడు, మద్దికుంట, కొండపల్కల, గంగిపల్లి గ్రామాలలోని మహిళలు పోచమ్మ బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బోనాలను పెట్టి నైవేద్యం సమర్పించారు.
- **చిగురుమామిడి:** మండలంలోని రేకొండ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. అమ్మ వారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం అధ్యక్షుడు బిల్ల మల్లారెడ్డి, రొంటాల ప్రతాప్‌రెడ్డి, కల్వల సంపత్‌రెడ్డి, బిల్ల రత్నకర్‌రెడ్డి, లక్ష్మరెడ్డి, మహేందర్‌రెడ్డి, చాడ అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.



రేకొండ లో పోచమ్మ బోనాలతో వెళుతున్న మహిళలు

- శంకరపట్నం: మండలంలోని ఇప్పలపల్లి పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు బోనాలు ఎత్తుకుని పోచమ్మ ఆలయం చేరుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

తండాల్లో ఎక్సైజ్ అధికారుల దాడులు

- 100 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 7: ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఎల్లారెడ్డిపేట , వీర్నపల్లి మండలాల్లోని బుగ్గరాజేశ్వరతండా, రాశిగుట్టతండాల్లో ఎక్సైజ్ సీఐ ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధికారులు ఆదివారం మెరుపు దాడులు నిర్వహించారు. సారా తయారీ కేంద్రాలను కనుగొని నిల్వ చేసిన 100 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. తరలించేందుకు సిద్ధంగా ఉన్న 14 లీటర్ల సారా, ద్విచక్రవాహనంతో పాటు సారా తయారీ ముడి సరుకైన 20 కిలోల పటిక, 10 కిలోల ఇప్పపువ్వును స్వాధీన పర్చుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని సీఐ ఎం శ్రీనివాస్ చెప్పారు. సారా తయారీ, రవాణా, విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో తండాల్లో నిఘాను తీవ్రతరం చేశామని తెలిపారు. నిత్యం తనిఖీలు, దాడులు నిర్వహించి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సీఐ ఎం. శ్రీనివాస్ స్పష్టం చేశారు. దాడుల్లో సిబ్బంది రాజు, కిశోర్, మల్లేశ్, కృష్ణ కాంత్, లావణ్య, శ్రీవాణి పాల్గొన్నారు.



● కొదురుపాక గ్రామం



● రుద్రవరం గ్రామం



● రుద్రవరం వేణుగోపాల స్వామి ఆలయం

ఇంకిన నీటిలో కదలాడుతున్న జ్ఞాపకాలు

వందల మంది నడిచిన దారులు.. వేల మందికి తిండిపెట్టిన పొలాలు.. ఎండలు మండినా చల్లని నీటినిచ్చిన బావులు.. ఊరందరినీ కాపాడిన దేవుళ్ల ఆలయాలు.. పిల్లలకు చదువు నేర్పి పెద్ద చేసిన పాఠశాలలు.. ఇవి మావీ అనుకుని నిశ్చింతగా జీవనం గడిపిన ఇళ్లు.. ఇలా.. ఒక్కొక్క జ్ఞాపకం తడారుతున్న నేల నుంచి బయటకు వస్తూ నిర్వాసితుల గుండెలు మెలిపెడుతున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిర్మించిన మిడ్ మానేరు, అనంతగిరి ప్రాజెక్టుల్లో 11 గ్రామాలు, 19,446 ఎకరాలు ముంపునకు గురయ్యాయి. కాళేశ్వరం నుంచి నీటి విడుదల నిలిచిపోవడంతో అనంతగిరి, మిడ్‌మానేరు ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తగ్గిపోయాయి. దీంతో ప్రాజెక్టుల్లో ముంపునకు గురైన గ్రామాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఆయా గ్రామాల ప్రజలు అక్కడికి వచ్చి తమ గ్రామాలను, ఇళ్లను చూస్తూ కన్నీటి పర్యంతమవుతున్నారు. ■ ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల

- ప్రాజెక్టుల నిర్మాణానికి ఉన్న ఊరు.. తిండిపెట్టే భూములను ఇచ్చిన నిర్వాసితులు
- ప్రస్తుతం నీటిమట్టాలు తగ్గడంతో బయటపడుతున్న నాటి ఆనవాళ్లు
- అప్పటి రోజులను గుర్తు చేసుకుంటున్న గ్రామస్థులు

జిల్లాలోని మానేరు వాగుపై బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద నిర్మించిన శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్‌లో 11 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. 7419 ఇళ్లే, 19446 ఎకరాల వ్యవసాయ భూములు, ముంపునకు గురయ్యాయి. 10,131 కుటుంబాలు తమ ఇళ్లను వదిలిపోవాల్సి వచ్చింది. ప్రభుత్వం అరకొర పరిహారం చెల్లించినా, ఎన్నో రకాల అసంతృప్తులు ఉన్నా నిర్వాసితులు ఉన్న ఊరును విడిచిపెట్టి పోయారు. వినని వారిని ప్రభుత్వం బలవంతంగా ఖాళీ చేయించింది. తమ తాత, ముత్తాతల నాటి భూములు, ఇళ్లను వదిలి వెళ్లిన వారు కొత్త ప్రాంతాల్లో ఇమడ లేక నానా ఇబ్బందులు పడ్డారు. రోజులు గడుస్తున్న కొద్దీ ప్రాజెక్టుల్లో నీరు నింపడం ప్రారంభమైంది. ఒక్కొక్కటిగా గ్రామాలు నీటిలో మునిగిపోయాయి. మిడ్‌మానేరు అనుబంధంగా నిర్మించిన అన్నపూర్ణ ప్రాజెక్ట్ కూడా జిల్లాలోని ఇల్లంతకుంటలో ఉంది. 1.5 టీఎంసీల నీటి సామర్థ్యంతో నిర్మించిన ప్రాజెక్ట్‌లో అనంతగిరి గ్రామం ముంపునకు గురయ్యింది. 3947 ఎకరాల భూమి, 1124 కుటుంబాలు తరలిపోయాయి.

ప్రస్తుతం వేసవి కాలంలో ఎండలు పెరిగాయి. కాళేశ్వరం ప్రాజెక్టు దెబ్బతినడంతో మిడ్‌మానేరు, అన్నపూర్ణ ప్రాజెక్టులకు వచ్చే నీరు నిలిచిపోయింది. 27.50 టీఎంసీ సామర్థ్యం ఉన్న మిడ్‌మానేరు ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం 7.50 టీఎంసీలు, అన్నపూర్ణ ప్రాజెక్ట్‌లో 0.83 టీఎంసీలు మాత్రమే ఉంది. ప్రాజెక్ట్‌లలో నీరు తగ్గడంతో ముంపునకు గురైన గ్రామాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. దీంతో నాడు గ్రామాలను వదిలివెళ్లిన గ్రామస్థులు తమ ప్రాంతాలకు వచ్చి అప్పటి రోజులను గుర్తు చేసుకుంటున్నారు. తాము చదువుకున్న బడిని చూసి స్నేహితులతో ఆటలాడుకున్న స్థలాన్ని గుర్తు చేసుకుంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు. శరీరం సహకరించకున్నా వృద్ధులు అక్కడికి వచ్చి తమ గ్రామాలను మళ్లీ చూస్తామో.. లేదోనని ఉద్విగ్నానికి గురవుతున్నారు.



● శాభాష్‌పల్లి గ్రామం



● చీర్లవంచ గ్రామం





● రుద్రవరం ప్రభుత్వ పాఠశాల

రాజన్న క్షేత్రంలో భక్తుల రద్దీ



క్యూలైన్లో బారులు తీరిన భక్తులు

వేములవాడ, ఏప్రిల్ 7: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం ఆదివారం నాడు భక్తులతో రద్దీగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తొలుత ఆలయ కళ్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి, ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరిం చారు. అనంతరం సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి ప్రవేశించి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ కారణంగా లఘు దర్శనం అమలు చేయడంతో భక్తులు నందీశ్వరుడి వద్ద నుంచి శ్రీ స్వామివారిని దర్శిం చుకున్నారు. కళాభవన్‌లో శ్రీ స్వామివారి నిత్య కల్యాణం, సత్యనారాయణ వ్రతం, బాలాత్రిపుర సుందరిదేవి ఆలయంలో కుంకుమ పూజ తదితర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. శ్రీ స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును పెద్ద సంఖ్యలో భక్తులు చెల్లించుకున్నారు. అనుబంధాలయమైన బద్దిపోచమ్మ ఆలయం సైతం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

ఘనంగా మహాలింగార్చన

వేములవాడ, ఏప్రిల్ 7: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారికి ఆదివారం మహా లింగార్చన, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. మాస శివరాత్రి సందర్భంగా ఆలయ అర్చకులు ఉదయం వేళలో శ్రీ స్వామివారికి మహా మండపంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం శ్రీస్వామివారి కల్యాణ మండపంలో మహాలింగార్చన నిర్వహించారు. లింగాకారంలో అమర్చిన ప్రమిదలలో మహిళలు జ్యోతులు వెలిగించారు.

సమాజంలో అసమానతలను రూపుమాపాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 7: సమాజంలో అసమానతలను రూపుమాపడానికి కవులు, రచయితలు కృషి చేయాలని తెలంగాణ విశ్వవిద్యాలయ అవార్డు గ్రహీత, సాహితీవేత్త డాక్టర్ గంగ్ర లక్ష్మణ్‌రావు అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని పద్మశాలి సంఘ భవనంలో ఆదివారం సిరిసిల్ల జిల్లా సాహితీ సమితి 28వ వార్షికోత్సవం సందర్భంగా సామాజిక చైతన్య దీపిక, జ్ఞానదీపికలు, పలువురికి ఉగాది సత్కారాలు పురస్కారాలు పుస్తకాలను అవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు రచయితలు, కవులను సత్కరించారు. కార్యక్రమంలో సిరిసిల్ల సాహితి సమితి అధ్యక్షుడు డాక్టర్ జనపాల శంకరయ్య, ప్రధాన కార్యదర్శి వెంగలలక్ష్మణ్, కవులు, రచయితలు గోశికొండ మురారి పంతులు, పోరండ్ల మురళీధర్, అఖిలభారత రచయితల సంఘం అధ్యక్షు జూకంటి జగన్నాథం, కరుణాల భద్రాచలం, అకునూరి శంకరయ్య, నీరు రమేష్, చేపూరి బుచ్చయ్య, గుండ్లపల్లి శ్రీనివాస్, శ్రీగాధ మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 7: ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామ శివారులోని మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం పట్టుకున్నామని పోలీసులు తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తున్నారనే సమాచారంతో అక్కడకు చేరుకుని స్వాధీనపర్చుకున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పదేళ్ల పాలనలో ప్రజలకు న్యాయం జరగలేదు

- తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కోదండరాం

గోదావరిఖని, ఏప్రిల్ 7: ఎందరో పోరాటాలు, బలిదానాలతో ఏర్పడిన తెలంగాణ లో పదేళ్ల పాలనలో ప్రజలకు న్యాయం జరుగలేదని తెలంగాణ జన సమితి అధ్య క్షుడు, ప్రొఫెసర్ కోదండరాం ఆరోపించారు. ఆదివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన తెలంగాణ ఉద్యోగుల సంఘం మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజ రై మాట్లాడారు. మన ఉద్యోగాలు, మన నీళ్లు, మన నియామకాల నినాదం గాలికి వదిలేశారని, కొద్ది మందికే సంపద మిగిలిందని, నిరుద్యోగ సమస్య తీరుతుందని ఆశపడ్డ నిరుద్యోగులకు నిరాశే మిగిలిందని, తెలంగాణ ఏర్పాటులో సింగరేణి కార్మి కుల పాత్ర మరిచిపోలేనిదని, 45రోజుల పాటు సమ్మె చేసి దేశ వ్యాప్తంగా విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం కల్పించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా తెలం గాణ సస్యశ్యామలం అవుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. సింగరేణి కార్మికులకు పేస్‌వర్క్‌పై అలవెన్సులు చెల్లించాలని, కార్మికులు ఉత్పత్తి చేసిన బొగ్గులో లాభాల వాటాపై 40శాతం లాభాల వాటా ఇవ్వాలని, ఓపెన్‌కాస్టులతో కాలుష్యం వెదజల్లు తుందని, వీటి స్థానంలో భూగర్భ గనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో పనిచేస్తున్న అసంఘటిత కార్మికులను పర్మినెంట్ చేయాలని, మెడికల్ కాలేజీలో సింగరేణి కార్మికుల పిల్లలకు 80శాతం రిజర్వేషన్ ఇవ్వాలని, సొంతింటి పథకం ద్వారా ఇల్లు ఇవ్వాలని, పదవీవిరమణ పొందిన కార్మికులకు రూ.20లక్షల హెల్త్ కార్డు, కార్మికులకు రూ.20లక్షల వడ్డీ లేని రుణం ఇవ్వాలని, కార్మికులు పని చేసేచోట నాణ్యమైన పనిముట్లను సమకూర్చాలని, కార్మికులందరికి క్యాడర్ స్కీం ఐదు సంవత్సరాలకు కుదించి అమలు చేయాలని, డిస్మిస్ కార్మికులకు ఎలాంటి నిబంధనలు లేకుండా అందరికి తిరిగి ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రామగుండం రీజియన్ కమిటీ అధ్యక్షులు కామెర గట్టయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి కుమారస్వామి, తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకులు గురిజాల రవీందర్‌రా వు, సీనియర్ జర్నలిస్టు ఎండీ మునీర్, హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు రియాజ్ అ హ్మద్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు విశ్వనాథ్, రాములు, ఈదునూరి నరేష్, దేవి సత్యం, కనకయ్య, శేఖర్, వెంకటేషం, కుమార్, భీమయ్య, రాయలింగు, రాయ పోషం, సలీంబేగ్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

వైభవంగా మల్లన్న బోనాల జాతర



బోనాలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 7: మండలంలోని కోండ్రికర్ల గ్రామంలో కొలిచిన వారికి కొంగుబంగారంగా వెలిసిన మల్లన్న స్వామి బోనాల జాతర వైభవంగా నిర్వహించారు. ఏటా హోలీ తరువాత వచ్చే మొదటి ఆదివారం పెద్దాపూర్ మల్లన్న జాతర యాదవుల ఆధ్వర్యంలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలను పురోహితుడు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, నాయకులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. శనివారం రాత్రి స్వామి వారి కల్యాణాన్ని పురోహితులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించిన అనంతరం బోనాల జాతర నిర్వహించారు. మహిళలు బోనాలను నెత్తిన ఎత్తుకొని శివశక్తుల పూనకాలు, పోతురాజుల నృత్యాలతో డప్పుచప్పుల్ల మధ్య ఆలయానికి చేరుకున్నారు. భక్తులు బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆయాభివృద్ధి కమిటీ సభ్యులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో జాతర ఉత్సవాల్లో పాల్గొన్న భక్తుల కోసం గ్రామానికి చెందిన గడ్డం రాజారెడ్డి చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఆలయాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

మల్యాల: మల్యాల పరిధిలోని కొత్తపేటలో నూతనంగా నిర్మించిన ముత్యాల పోచమ్మతల్లి ఆలయంలో ఇటీవలే పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం జరుగగా ఆదివారం బోనాల వేడుక నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి పోచమ్మకు మొక్కులు సమర్పించారు. ఈ సందర్భంగా పోతరాజు వేషధారణ నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎల్లాల జనార్ధన్‌రెడ్డి, అల్లూరి రాజేశ్వర్‌రెడ్డి, నెరెళ్ల భూమరెడ్డి, ఒడ్డెపల్లి శశాంక్, పోతరాజు శ్రీనివాస్, పోతరాజు శ్రీధర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 7: మండలంలోని జోగినిపల్లి క్రాస్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రాయికల్ మండల కేంద్రానికి చెందిన కటకం లక్ష్మీకాంతం (60) అనే వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మీకాతం కోరుట్ల మండలంలోని మాదాపూర్ గ్రామంలో జరిగిన విందు కార్యక్రమంలో పాల్గొన్ని తిరిగి ద్విచక్ర వాహనంపై రాయికల్ వెళుతున్నాడు. జోగినిపల్లి క్రాస్ రోడ్డు వద్దకు చేరుకోగా వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కకు పడిపోయింది. దీంతో తీవ్ర గాయలై లక్ష్మీకాతం అక్కడిక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. లక్ష్మీకాతం బంధువుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కోరుట్ల ఆస్పపత్రికి తరలించినట్లు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు మృతదేహం అప్పగించినట్లు పోలీసులు వివరించారు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

మల్యాల, ఏప్రిల్ 7: మండలంలోని ఓగులాపూర్‌కు చెందిన ఓ మహిళ అప్పుల బాధతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. బొజ్జ లక్ష్మి(38)అనే మహిళ అప్పుల బాధ భరించలేక శనివారం ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆదివారం గ్రామ శివారులోని వేంకటెశ్వర్ల గుట్ట వద్ద చెట్టుకు ఉరి వేసుకొని కనిపించింది. దీంతో గ్రామస్థులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. లక్ష్మికి భర్తతో పాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. లక్ష్మి భర్త బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై కృష్ణకుమార్ తెలిపారు.

పోలీసులకు బాలిక అప్పగింత

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 7 : పెద్దపల్లి మండలంలోని కాపులపల్లి గ్రామం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న బాలికను గమనించిన స్థానికులు కనగర్తి గ్రామహనుమాన్ ఆలయం వద్దకు తీసుకవచ్చి పోలీసులకు సమాచారం అందించారు. అంతకుముందు బాలికను వివరాలు అడుగగా తనది చొప్పదండి మండలం ఆర్నకొండ అని, గుర్తు తెలియని వ్యక్తులు తీసుకవచ్చి వదిలేసినట్లు తెలిపింది. పెద్దపల్లి ఎస్సై 2 మల్లేష్ పోలీస్ స్టేషన్‌కు తరలించి బాలిక తల్లిదండ్రులకు సమాచారం అందించే ప్రయత్నంలో ఉన్నారు.

నేడు హైదరాబాద్‌లో రౌండ్ టేబుల్ సమావేశం

- నేతన్నల సమస్యలపై చర్చ
- జేఏసీ నాయకుల వెల్లడి

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 7: సిరిసిల్ల నేతన్న సమస్యలపై సోమవారం హైదరాబాద్‌లో అల్ ట్రేడ్ యూనియన్స్ రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసి చర్చించనున్నామని జేఏసీ నాయకులు ప్రకటించారు. సిరిసిల్ల పట్టణంలోని చేనేత వస్త్ర వ్యాపార సంఘం భవనంలో ఆదివారం వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఐక్య వేధిక జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ శనివారం రాత్రి సిరిసిల్ల జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన నేతన్నల గర్జనలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేసిందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపేలా ఒత్తిడి తీసుకొస్తామని చెప్పారు. వస్త్ర పరిశ్రమలపై అధారపడి జీవిస్తున్న నేతన్నలందరికీ ప్రభుత్వం వెంటనే ఉపాధిని కల్పించే విధంగా చర్యలు తీసుకునేలా పోరాడుతామని తెలిపారు. శనివారం రాజీవ్‌నగర్‌కు చెందిన సిరిపురం లక్ష్మీనారాయణ అనే మరమగ్గాల కార్మికుడు సరైన ఉపాధిలేక అర్థికంగా ఇబ్బందులు పడుతూ అత్మహత్యకు పాల్పడ్డారని చెప్పారు. కాగా చేనేత జౌళీశాఖ ఏడీ మాత్రం అనారోగ్యంతో చనిపోయినట్లు పత్రిక ప్రకటన ఇవ్వడం సరికాదన్నా రు. ప్రస్తుతం సిరిసిల్లలో సంక్షోభం వలన ఒక వైపు ఉపాధిలేక మరోవైపు అర్థికంగా ఇబ్బందులు భరించలేక మనస్తాపానికి గురై అత్మహత్య చేసుకుంటే అనారోగ్యం కారాణంగా అంటూ పత్రిక ప్రకటనను ఇవ్వడాన్ని ఖండిస్తున్నామన్నారు. స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్, ఎంపీ బండిసంజయ్‌కుమార్ చనిపోయిన కుటుంబాన్ని పరామర్శించి డబ్బులు అందిస్తే సరిపోదని చెప్పారు. మీరు ప్రాతినిత్యం వహిస్తున్న సిరిసిల్లలో నేతన్నల సమస్యల పరిష్కారం కోసం ఏమి చేస్తున్నారో ఆలోచించుకోవాలని హితవుపలికారు. నిజంగా అధికారులకు, ప్రభుత్వానికి , ప్రజాప్రతినిధుల కు చిత్తశుద్ధి ఉంటే మరోక కార్మికుడు బలికాకముందే వెంటనే సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సిరిసిల్ల నేతన్నల సమస్యలపై ప్రభుత్వంపై ఒతి్తడి తీసుకొచ్చి సమస్యల పరిష్కారం కోసం సోమవారం హైదరాబా ద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అల్‌ట్రేడ్ యూనియన్ అధ్వర్యం లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. సమావేశంలో మూషం రమేష్, పంతం రవి, మండల సత్యం, తాటిపాముల దామో దర్, కట్టికోల లక్ష్మీనారాయణ, సిరిసిల్ల రవీందర్, కోడం రమణ, సిరిమల్ల సత్యం, మండల రాజు, వెల్దండి దేవదాస్, గౌడరాజు, పిస్క మధు, వేముల దామెదర్, బోడ్డు శ్రీధర్, నక్క దేవదాస్, ఒగ్గు గణేష్, బండారి అశోక్ పాల్గొన్నారు.



సిరిసిల్లలో మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

ఆరోగ్యంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 7: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలని మేయర్ వై.సునీల్‌రావు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం అంబేద్కర్ స్టేడియంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా రెనే మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం, ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. ఈ కార్యక్రమాలను వారు ప్రారంభించి మాట్లాడారు. ఉచిత విద్య, ఉచిత వైద్య ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. కరీంనగర్‌లో ఆధునిక వైద్య సదుపాయాలను అందిస్తున్న డాక్టర్ బంగారి స్వామి వృత్తి నిబద్ధతను ప్రశంసించారు. అనంతరం డాక్టర్ బంగారి స్వామి మాట్లాడుతూ నా ఆరోగ్యం నా హక్కు అనే నినాదంతో ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించామన్నారు. సమన్వయకర్త డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతు ఆహారపు అలవాట్లు మన వ్యక్తిగత ఆరోగ్యానికి ఊతం ఇస్తాయన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నిఖిల్ లక్ష్మన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్లాష్‌మాబ్ ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్రాచారి, డాక్టర్ దినకర్, డాక్టర్ యోగేందర్, జనరల్ మేనేజర్ మేకల అరవిందరావు, ఒలంపిక్ అసోసియేషన్ బాధ్యులు జి.జనార్దన్‌రెడ్డి, తుమ్మల రమేశ్‌రెడ్డి, శాతవాహన లయన్స్‌క్లబ్ బాధ్యులు ఎం మేదర్, డాక్టర్ లక్ష్మారెడ్డి, సురేందర్, వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు రమణారెడ్డి, రవీందర్‌రెడ్డి, రవీందర్ రెనే సిబ్బంది పాల్గొన్నారు.

'ఆరోగ్యవంతమైన నిద్ర తప్పనిసరి'



మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్

సుభాష్‌నగర్, ఏప్రిల్7: హార్ట్, బ్రెయిన్ పనితీరు మెరుగుపడాలంటే ఆరోగ్య వంతమైన నిద్ర తప్పనిసరి అని మెడికవర్ వైద్యులు డాక్టర్ కొండపాక కిరణ్, డాక్టర్ రవిశంకర్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్ఆర్ఆర్ కాలేజీలో ఉచిత గుండె, కిడ్నీ, గైనకాలజీ, న్యూరో, యముకలు, సాధారణ వ్యాధుల ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యశిబిరాన్ని కార్పొరేటర్ సుమరమణారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, డాక్టర్ నాగరాజు, డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ ఉపేందర్‌రెడ్డి, డాక్టర్ రవిమల్లారెడ్డి, మార్కెటింగ్ హెడ్ కరుణాకర్, హెచ్ఆర్ మేనేజర్ ఈశ్వర్ పాల్గొన్నారు.

పోచమ్మ బోనాలు



మొగ్దుంపూర్‌లో పూజలు చేస్తున్న ఎంపీ బండి సంజయ్‌కుమార్

కరీంనగర్‌రూరల్, ఏప్రిల్7: నగరంలోని తీగలగుట్టపల్లి పోచమ్మ బోనాలు, కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్‌లో మల్లికార్జున స్వామి కల్యాణంలో ఎంపీ బండి సంజయ్ పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్, గాండ్ల శ్రీనివాస్, భక్తులు, ప్రజలుపాల్గొన్నారు.

చర్లబూత్కూర్‌లో..

కరీంనగర్ రూరల్; ఏప్రిల్ 7: కరీంనగర్ రూరల్ మండలం చర్లబూత్కూర్ గ్రామంలో నిర్వహించిన పోచమ్మ బోనాలకు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, నల్ల శ్రీనివాస్, పెండ్యాల మల్లారెడ్డి, దామోదర్, ప్రవీణ్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, నరేష్ రెడ్డి, నారాయణగౌడ్, స్వామిగౌడ్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

శంకరపట్నం, ఏప్రిల్ 7: శంకరపట్నం మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్, యువజన సంఘం నాయకులు ఆదివారం బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన ఖాజాపాషా, రాసమల్ల శ్రీనివాస్, చెర్ల శ్రీనివాస్, బొంగోని కుమార్, కనుకుంట్ల శ్రీనివాస్, పంజాల అనిల్‌గౌడ్, కునారపు శ్రీనాథ్, బైరి రాజు, బొంతుల రవి, మెడిశెట్టి రాజేష్, గుర్రం పవన్, రాసమల్ల సుధాకర్ ఉన్నారు.

పీహెచ్‌సీ సిబ్బందికి సన్మానం

రామడుగు, ఏప్రిల్ 7: మండలంలోని గోపాల్‌రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సిబ్బందిని సన్మానించారు. బీఆర్ఎస్ మండల యువజన విభాగం ఉపాధ్యక్షుడు బుదారపు కార్తీక్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో పాటు ఆశా కార్యకర్తలను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఎడవెల్లి నరేందర్‌రెడ్డి, పద్మశాలి యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక కమలాకర్, నాయకులు పాపిరెడ్డి, రమేశ్, నరేందర్, నిశాంత్ పాల్గొన్నారు.

వైభవంగా పట్టాభిషేక మహోత్సం

జమ్మికుంట రూరల్ ఏప్రిల్ 7: మండలంలోని జగ్గయ్యపల్లి గ్రామంలో నాలుగు రోజులుగా వేస్తున్నా రామాయణ మహకావ్యం ఘట్టం పట్టాభిషేక మహోత్సవం ఆదివారం వైభవంగా ముగిసింది. కాకతీయ విద్యా సంస్థల చైర్మన్ అవిరినేని సుధాకర్‌రావు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో గురువు బొళ్ల కొమురయ్య, సహా యకులు పడాల సత్యనారాయణ, కళాకా రులు హుస్సేన్, భిక్షపతి, సీత మల్లన్న, మోహన్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

గీత కార్మికుల హక్కుల కోసం పోరాడుతాం



మాట్లాడుతున్న గౌడ సంఘం మండల అధ్యక్షుడు తిరుపతిగౌడ్

చిగురుమామిడి, ఏప్రిల్ 7: కుల వృత్తిని నమ్ముకునే జీవించే గీతకార్మికుల హక్కుల కోసం రాజీ లేని పోరాటం చేస్తామని గౌడ సంఘం మండల అధ్యక్షుడు తాళ్లపెల్లి తిరుపతిగౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గౌడ సామాజిక వర్గాలకు ప్రత్యేక నిధులు కేటాయించి తమ కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో విజ్జగిరిగౌడు, తాళ్లపెల్లి భాస్కర్‌గౌడ్, బొమ్మగాని వెంకటేశం, సుదగోని సుద ర్శన్‌గౌడ్, బుర్ర తిరుపతిగౌడ్, బుర్ర శ్రీనివాస్‌గౌడ్, సంతోష్‌గౌడ్, బండారుపల్లి అంతేగౌడ్, నోముల పర్శారాములుగౌడ్, బొంగోని రాజేశంగౌడ్, బురుగు అనంతరాములు గౌడ్, తళ్లపెల్లి కుమార్‌గౌడ్, తాళ్లపెల్లి సంపత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. కాగా మండల గౌడ సంఘం తాత్కాలిక అధ్యక్షుడిగా బండారుపల్లి చంద్రంను ఎంపిక చేసినట్లు గీత కార్మికుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తాళ్లపెల్లి తిరుపతిగౌడ్ తెలిపారు.


మలుపుల్లో ప్రమాదాలు

- నియంత్రణ పట్టని అధికారులు
- ప్రాణాలు పోతున్నా పాఠాలు నేర్వరా?



ప్రమాదకరంగా మారిన మూలమలుపు

హుజూరాబాద్, ఏప్రిల్ 7: హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బోర్నపల్లిలో మూలమలుపులతో చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి. శుక్రవారం అర్ధరాత్రి ఇదే మూలమలుపు వద్ద టిప్పర్ బోల్తా పడి మట్టిలో కురుకపోయి ముగ్గురు విద్యార్థులు సజీవ సమాధి అయ్యారు. అతి వేగమే ప్రమాదాలకు కారణమని అధికారులు నిర్ధారిస్తున్నారేగాని, వేగ నియంత్రనకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇలా ప్రమాదాలు జరుగుతున్నా మున్సిపల్, ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. నాలుగేళ్ల క్రితం హుజూరాబాద్-సైదాపూర్ డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టారు.



ప్రమాదకరంగా మారిన మూలమలుపు

అప్పటి కాంట్రాక్టర్ గ్రామంలో మూల మలుపుల వద్ద నేరుగా రోడ్డు వేసేందుకు ప్రయత్నించగా, రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు గురిచేయడంతో తలొగ్గారు. రోడ్డు విస్తరణ చేపడితే ఇళ్లు పోతాయనే ఉద్దేశ్యం తో అప్పటి కాంట్రాక్టర్‌ను ఇళ్లు కోల్పోతున్నవారు బెదిరించారు. దీంతో కాంట్రాక్టర్ ఏం చేయలేక మూల మలుపులోనే రోడ్డు వేసి చేతులు దులుపుకున్నాడు. దీంతో ఆ ప్రదేశంలో వేగంగా వస్తున్న వాహనాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండు నెలల క్రితం ద్విచక్ర వాహనాలు మూలమలుపు వద్ద ఢీకొట్టిన ప్రమాదాంలో ఇద్దరికి గాయాలయ్యాయి. మూల మలుపుల వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు అధికారులు ఏర్పాటు చేయలేదు. దీనికి తగ్గట్టుగా రోడ్డు పక్కకే మురికికాలువల గుంత ఉన్న కూడా మున్సిపల్ అధికారులు పట్టిం చుకోవడం లేదు. రోడ్డు పక్కనే పెత్తఎత్తున చెట్లు ఉన్నా పట్టించుకున్న వారే లేకుండా పోయారు. చెట్లు ఉండడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనబడ కపోవడంతోనే ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మూల మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులతో పాటు, ప్రమాదకరంగా ఉన్న చెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

'సంస్కృతిని చదువులతో మేళవించాలి'

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 7: మన సంస్కృతిని చదువుతో మేళవించాలని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కల్వకుంట్ల రామకృష్ణ అన్నారు. మన సంస్కృతి నుంచి మన చదువులను వేరు చేస్తే మనం మనంగా ఉండకుండా పరాయి వాళ్ళుగా బతకాల్సి వస్తుందని ప్రిన్సిపాల్ డాక్టర్ కల్వకుంట్ల రామకృష్ణ అన్నారు. మన సంస్కృతిని చదువులతో మేళవించాలని అన్నారు. ఆదివారం స్థానిక సప్తగిరి కాలనీలోని సప్తగిరి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

మన కరిక్యులంలో మనదైన భావజాలంతో స్థానికత, జాతీయత, దేశభక్తి, సంస్కృతి పరిరక్షణ వంటి అంశాలు ప్రధాన భూమికలుగా పాఠ్యాంశాలు రూపొందితే అది చదివిన విద్యార్థులు రేపటి నిజమైన భారతీయపౌరులుగా ఎదిగే అవకాశాలుంటాయని అన్నారు. చదువంటే కేవలం బట్టీపట్టడం కాదని, జీవితంలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం చూపించే విధంగా ఆలోచించే జ్ఞానాన్ని పెంపొందించడం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజ్ఞాభారతి చైర్మన్ డాక్టర్ ఎల్.రాజభాస్కర్‌రెడ్డి ప్రసంగించగా పాఠశాల చైర్మన్ మండల నగేశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అనితారెడ్డి, డైరెక్టర్ విపుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నియామకాలు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్7: కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఎన్నికల ఇంచార్జిగా కొత్తపల్లికి చెందిన యువజన కాంగ్రెస్ ఆర్టీఐ విభాగం జిల్లా అధ్యక్షుడు జేరిపోతుల వాసును నియామకం చేశారు. ఈ మేరకు యువజన కాంగ్రెస్ ఆర్టీఐ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సళ్ళ నరేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. తన సేవలను గుర్తించి, తనపై నమ్మకంతో బాధ్యతలను అప్పగించిన కాంగ్రెస్‌పార్టీ నాయకులకు వాసు కృతజ్ఞతలు తెలిపారు.

● కాంగ్రెస్‌పార్టీ మైనార్టీ విభాగం జిల్లా ప్రచార కార్యదర్శిగా కరీంనగర్‌కు చెందిన ఎంఏ ఇక్రమ్ అహ్మద్ సిద్ధిఖిని నియమిస్తూ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండీ తాజ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కశ్మీర్‌గడ్డ 54వ డివిజన్ కార్యాలయంలో నియామకపు పత్రాన్ని ఇక్రమ్ అహ్మద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నేహాల్ అహ్మద్, ఎండీ ఖలీం ఉద్దీన్, ఎండీ రజుయొద్దీన్, సయ్యద్ కరీం, తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 7: కొత్తపల్లి మండలంలోని చింతకుంట గ్రామంలో ఆదివారం సాయంత్రం కరీంనగర్ బీఆర్ ఎస్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ తుల ఉమ, ఎంపిపి పిల్లి శ్రీలతమహేష్, మాజీ కో-అప్షన్ సభ్యుడు జమీల్, వైస ఎంపిపి తిరుపతి నాయక్, చాంద్‌పాషా, నజీమా, సలీం, వాజిద్, రైయిస్, జాంగిర్, అన్వర్, నఫీజా, సిద్ధిక్ తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధి కోసం వినోద్‌కుమార్‌ను గెలిపించండి'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 7: కరీంనగర్‌లో అభివృద్ధి ఆగకుండా మరింత వేగంగా కొనసాగేందుకు బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రజలకు విజ్ఞప్తిచేశారు. ఆదివారం నగరంలోని తొమ్మిదవ డివిజన్‌లో బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్, మేయర్ యాదగిరి సునీల్‌రావుతో కలిసి ఏర్పాటుచేసిన డివిజన్ ప్రముఖులు, సీనియర్లు, వాకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆనాటి సీఎం కేసీఆర్ కరీంనగర్ అభివృద్ధికి సీఎం హామీ కింద 350 కోట్లకు పైగా నిధులు కేటాయించారని అన్నారు. 10 లక్షల జనాభా ఉన్న నగరాలనే స్మార్ట్‌సిటీకి ఎంపిక చేయాల్సి ఉండగా ఆనాటి సీఎం కేసీఆర్ సహకారంతో ఎంపీ వినోద్ కుమార్, ఎమ్మెల్యేగా నేను కార్పొరేటర్లందరిని ఢిల్లీకి తీసుకెళ్ళి కేంద్రమంత్రి వెంకయ్య నాయుడుని కలిసి స్మార్ట్‌సిటీని సాధించుకు రావడంతో కేంద్ర, రాష్ట్ర నిధులు వేయి కోట్లతో కరీంనగర్ స్మార్ట్‌సిటీగా మారి రూపురేఖలు పూర్తిగా మారాయని అన్నారు. పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకలా మారేందుకు తనకు ఓటు వేసి గెలిపించాలని బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి వినోద్‌కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎంపీగా బండి సంజయ్‌ని గెలిపిస్తే ఐదేళ్లలో నియోజకవర్గ ప్రజలకు చేసిందేమి లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్ జంగిలి ఐలేందర్‌యాదవ్, నాయకులు గందె మహేశ్, కలర్ సత్తన్న, తాటి ప్రభావతి, బండ వేణు, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ రిప్రజెంటేటివ్స్ కార్యవర్గం



రమేశ్ అంజయ్య

సుభాష్‌నగర్, ఏప్రిల్ 7: తెలంగాణ సేల్స్ అండ్ మెడికల్ రిప్రజెంటేటివ్స్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం నగరంలోని భగత్‌నగర్‌లోగల మెడికల్ రిప్స్ భవన్‌లో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ఎ.రమేశ్, కార్యదర్శి ఎం.అజయ్య, ఉపాధ్యక్షులుగా జెఎల్ నరసింహరెడ్డి, కె శ్రవణ్ కుమార్, సహాయ కార్యదర్శులుగా కె సంపత్ రెడ్డి, పి.నరేందర్, కోశాధికారిగా వెంకటే శ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు చీకోటి శ్రీధర్ మాట్లాడుతూ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ కోసం ఏర్పాటు చేసిన 1976 సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్ యాక్ట్ చట్టాన్ని పరిరక్షించుకోవాలన్నారు. ఫారం ఏలో ఫార్మా యాజమాన్యాలు నియామక పత్రాలు ఇవ్వాలని, కార్మిక చట్టాలను కాలరాస్తున్న ఫార్మా యాజమాన్యాలను శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ నాగేశ్వర్‌రావు, జి విద్యాసాగర్, ఎ సదానందచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుండా శ్రీనివాస్, లోకేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

సైదాపూర్, ఏప్రిల్ 7: హుజూరాబాద్-హుస్నాబాద్ రహదారిపై ఆదివారం కేంద్ర బలగాలతో కలిసి ఎస్సై జన్ను ఆరోగ్యం వాహనాలు తనిఖీ చేశారు. సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని సూచించారు.

ముస్లింలకు ఎమ్మెల్యే ఇఫ్తార్ విందు

తిమ్మాపూర్, ఏప్రిల్ 7: మండలంలోని ఎల్ఎండీ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ముస్లింలకు ఆదివారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి ముస్లింలు హాజరయ్యారు. ఎమ్మెల్యే ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు ముస్లి మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

జర్నలిస్టులు తోడ్పాటునందించాలి

తిమ్మాపూర్: కబ్జాదారుల నుంచి ప్రభుత్వ భూముల పరిరక్షణకు జర్నలిస్టులు తమవంతు తోడ్పాటునందించాలని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కోరారు. ఆదివారం ఎల్ఎండీ కాలనీలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఆరు మండలాల పాత్రికేయుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నియోజకవర్గంలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, ప్రెస్‌క్లబ్‌ల అధ్యక్షులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా బొమ్మకల్ చౌరస్తా

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 7: ప్రమాదాలకు నెలవుగా బొమ్మకల్ చౌరస్తా మారింది. నగరంలోని ఆరవ డివిజన్ బొమ్మకల్ చౌరస్తాలో ప్రతిరోజు ప్రమాదాలు జరుగుతున్నాయని, కొన్ని త్రుటిలో తప్పిపోగా, మరికొన్ని సందర్భాల్లో ప్రాణాలు కూడా కోల్పోతున్నారని బీజేపీ నాయకుడు అవుదూర్తి శ్రీనివాస్ ఆవేదన చెందారు. ప్రమాదాల నివారణకు వెంటనే స్పందించి స్పీడ్ బ్రేకర్‌లు వేయించాలని ఆయన జిల్లా అధికార యంత్రాంగాన్ని కోరారు.

రేపు ఉగాది పురస్కారాలు

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 7: యాదవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పురస్కారాలను జిల్లా కేంద్రంలో సిరి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఉదయం 9గంటల నుంచి కార్యక్రమాలు ప్రారంభించనున్నట్లు అఖిల భారత యాదవ మహాసభ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సందనవేన రాజేందర్ యాదవ్, యాదవ చారిటబుల్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు మారం తిరుపతి యాదవ్ తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా ప్రతి ఏటా ఉగాది పురస్కారాలు అందజేస్తున్నామన్నారు. జిల్లాలోని యాదవులలో ఆరు రంగాల్లో పలు సేవా, విశిష్టత గాని ఇతర సంఘానికి ఉపయోగపడే కార్యక్రమాలను చేపట్టిన వారిని సెలక్షన్ కమిటీ ద్వారా గుర్తించి సత్కరిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

తిమ్మాపూర్, ఏప్రిల్ 7: మండలంలోని రేణిగుంట గ్రామం రాజీవ్ రహదారిపై ఆదివారం రాత్రి రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనకాల నుంచి ద్విచక్ర హనం ఢీకొట్టిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. స్థానికులు ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం,, మంథని నుంచి ఇసుక లోడుతో హైదరాబాద్ వెళుతున్న లారీ రేణికుంట గ్రామం వద్ద రాజీవ్ రహదారి వద్ద చెడిపోయింది. దీంతో డ్రైవర్ దొడ్డు పక్కన లారీని నిలిపివేశాడు. సిద్దిపేట జిల్లా గుండారెడ్డిపల్లి గ్రామం కోహెడ మండలానికి చెందిన కర్తల రాజశేఖర్‌రెడ్డి (25) తన ద్విచక్రవాహనంపై కరీంనగర్ నుంచి స్వగ్రామానికి వెళుతున్నారు. ఆ సమయంలో రేణిగుంట వద్ద నిలిచి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొన్నాడు. దీంతో రాజశేఖర్ రెడ్డి తీవ్ర గాయాలతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు.

బైక్ ఢీకొని ఒకరు..

శంకరపట్నం, ఏప్రిల్ 7: శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామ శివారులోని కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై ఆదివారం ద్విచక్ర వాహనం ఢీ కొని ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తగట్టు గ్రామానికి చెందిన అంబాల అయిలయ్య (50) మొలంగూర్‌లోని రైస్‌మిల్లులో నైట్ వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం జాతీయ రహదారి పక్కనున్న ఓ హోటల్‌లో టీ తాగి వస్తున్న క్రమంలో మొలంగూర్ గ్రామానికి చెందిన బండి సంతోష్ అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంతో అయిలయ్యను వెనుక నుంచి ఢీ కొట్టాడు. ఈ ఘటనలో అయిలయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు.

మద్యం సీసాలు పట్టివేత

శంకరపట్నం, ఏప్రిల్ 7: వైన్స్ నుంచి అక్రమంగా మద్యం సీసా లు తీసుకెళ్తున్న వ్యక్తిని ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్సై పాకాల లక్ష్మారెడ్డి తెలిపారు. సైదాపూర్ మండలం ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన ఎండీ షాబుద్దీన్ రూ. 3,210 విలువ చేసే మద్యాన్ని తన బెల్ట్ షాపులో విక్రయిం చేందుకు తీసుకెళ్తుండగా పట్టుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నా మని ఎస్సై తెలిపారు.

కరాటే విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్



బెల్ట్‌లు సాధించిన కరాటే విద్యార్థులు

మంథని, ఏప్రిల్ 7: జేకేఏ షోటోకాన్ కరాటే విద్యార్థులకు స్థానిక శ్రీలక్ష్మీభారతి గార్డెన్స్‌లో కరాటే ఇన్‌స్ట్రక్టర్ కోండ్ర నాగరాజు ఆధ్వర్యంలో 53 మంది విద్యార్థులకు గ్రేడింగ్ టెస్టును ఆదివారం నిర్వహించారు. టెస్టులో ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు 12 జూనియర్ రెడ్, 10 ఎల్లో, 20 ఆరెంజ్, 6 గ్రీన్, 5 బ్రౌన్ బెల్టులను, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. గ్రేడింగ్ టెస్టును షోటోకాన్ కరాటే రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూకల బానయ్య పర్యవేక్షించారు. కార్యక్రమంలో మంథని మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీపతి బానయ్య, కౌన్సిలర్ వీకే. రవిలు పాల్గొనగా విద్యార్థులను జేకేఏ సౌత్ ఇండియా ఇంచార్జి రాపోలు సుదర్శన్ సీనియర్ మాస్టర్ పర్శా బక్కయ్య, శంకర్‌లు అభినందించారు.

'బీఆర్ఎస్ అధికారంలో ఉండగా రైతులు గుర్తు రాలేదా?'

మంథని, ఏప్రిల్ 7: రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతుల సమస్యలు గుర్తు రాలేదా అని కాంగ్రెస్ నేతలు అయిలి ప్రసాద్, ఉప్పట్ల శ్రీనివాస్, పోలు శివలు ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో ఇక్కడి రైతుల భూములను లాక్కొని నీటిని ఇతర ప్రాంతాలకు తరలిస్తే జడ్పీ చైర్మన్ పుట్ట మధు ఎందుకు అడ్డుకోలేక పోయారని వారు ప్రశ్నించారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు దోపిడీ, హత్యా రాజకీయాలు చేసింది ఎవరో ప్రజలకు తెలుసన్నారు. రైతులకు ఎలా సాగు నీరు ఇవ్వాలో తమ నాయకుడికి పూర్తిస్థాయిలో అవగాహన ఉందన్నారు. గతంలో ఈ ప్రాంతంలో నీళ్ల వల్ల పంటలు మునిగితే ఎందుకు స్పందించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఇష్టం వచ్చి నట్లు ఆరోపణలు చేయడం తగదన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, ఏప్రిల్ 7: నగరంలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నగరంలో వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు టౌన్ వన్ ఏడీఈ సాయినేని నరేందర్ తెలిపారు. 33/11కెవి పద్మనగర్ సబ్‌స్టేషన్ మంకమ్మతోట, సంతోష్‌నగర్, వినాయక్ నగర్, కుర్మ వాడ, శ్రీహరినగర్, పీటీసీ, మార్కండేయనగర్, ప్రగతి నగర్, రాజీవ్‌పార్క్, పాతలేబర్ అడ్డ, ఆదిత్య అపార్ట్‌మెంట్ ఏరియా, సిద్ధార్థ పాఠశాల, వాసర హాస్పిటల్, పారమిత పాఠశాల ప్రాంతం, లయోలా పాఠశాల ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

గన్నేరువరం మండలంలో..

గన్నేరువరం, ఏప్రిల్ 7, మండలంలోని 33 కేవీ విద్యుత్ లైన్ కింద ఉన్న చెట్లను తొలగించే పనులు చేపడుతున్నందున సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ ఆంజనే యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 7: పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన కొత్తపల్లి మండలం కమాన్‌పూర్‌కు చెందిన పి.రాజు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడని కరీంనగర్ మూడవ ఠాణ పోలీసులు తెలిపారు. రాజు ఈనెల 2న కరీంనగర్‌లోని ఆదర్శనగర్ బోర్డు వద్ద గడ్డి మందు తాగగా కుటుంబ సభ్యులు అతడిని ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. రాజు ఆత్మహత్యకు ఆయన అత్తింటి వారే కారణమని వారి వేధింపులతోనే ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తల్లి మల్లవ్వ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అల్పాహారం పంపిణీ

సుభాష్‌నగర్, ఏప్రిల్ 7: బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జివి రామకృష్ణారావు జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ తిమ్మాపూర్ మండల సోషల్ మీడియా కన్వీనర్ సుదగోని సదయ్య ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ చేశారు. ఆదివారం జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పేషంట్లకు లయన్స్‌క్లబ్ సహకారంతో అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో దరిపల్లి వేణుకుమార్, మస్కురి నరేష్, బొలుమల్ల రాకేశ్, మంగపట్నం శ్రీరామ్, బీనపల్లి సంపత్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు డీఏ ఇవ్వాలి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 7: జిల్లాలో హెచ్ఆర్ఏ పరిధిలో పనిచేస్తున్న ఎస్‌జీటీ, పీఈటీలకు పదోతరగతి స్పాట్ డ్యూటీలు వేయడంతో పాటు హెచ్ఆర్ఏ పరిధి దాటిన ఉపాధ్యాయులకు కూడా విధులు వేశారని, వారికి అదనంగా టీఏ, డీఏ ఇవ్వాలని టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.దామోదర్ రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రెమ్యూనరేషన్‌ను రూ.250 నుంచి 500లకు పెంచాలని స్పాట్ డిప్యూటీ క్యాంపు ఆఫీసర్ మధుసూదనా చారికి, రాష్ట్ర పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావుకు సంఘం తరపున వినతిపత్రాలను అందజేశారు.

'బార్' అసోసియేషన్ ప్రధాన కార్యదర్శికి సన్మానం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 7: ఇటీవల జరిగిన జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో ప్రధాన కార్యదర్శిగా గెలుపొందిన సీనియర్ న్యాయవాది బేతి మహేందర్‌రెడ్డిని రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆదివారం రాజబహద్దూర్ వెంకటరామిరెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు నరహరి లక్ష్మారెడ్డి, గంటల నర్సింహారెడ్డి, సంది మోహన్‌రెడ్డి, ఈరెడ్డి తిరుమల్‌రెడ్డి సన్మానించారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

కరీంనగర్‌రూరల్, ఏప్రిల్ 7: కరీంనగర్ రూరల్ మండలం చర్లబూత్కూర్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ కేశవరెడ్డి, వీరారెడ్డి, శ్రీహరిరెడ్డి పాల్గొన్నారు.

సీపీఐ పార్లమెంట్ కన్వీనర్‌గా వెంకటస్వామి



భగత్‌నగర్, ఏప్రిల్ 7: కరీంనగర్ పార్లమెంట్ సీపీఐ ఎన్నికల కమిటీ కన్వీనర్‌గా మర్రి వెంకటస్వామి ఎన్నికయ్యారు. పార్లమెంట్ నియోజక వర్గ పరిధిలోని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు, ప్రజాసంఘాల ఆఫీస్ బేరర్స్ సమావేశంలో, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి సమక్షంలో మర్రి వెంకటస్వామిని పార్లమెంట్ ఎన్నికల కన్వీనర్‌గా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా సిద్దిపేట, హన్మకొండ, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల సీపీఐ కార్యదర్శులు మంద పవన్, కర్రె బిక్షపతి, గుంటి వేణు, వెన్న సురేష్, పొనగంటి కేదారి, మల్లేష్‌ను ఎన్నుకున్నారు.

ఘనంగా జీవీఆర్ జన్మదిన వేడుకలు

మానకొండూర్, ఏప్రిల్ 7: బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కరీంనగర్ మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్‌కుమార్, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, జడ్పీటీసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్, కార్యకర్తలు, అభిమానుల మధ్య రామకృష్ణారావు కేక్‌కట్ చేశారు.

వైభవంగా మల్లికార్జున స్వామి కల్యాణం

చొప్పదండి, ఏప్రిల్ 7: మండలంలోని మలన్నపల్లి శివారులోని గట్టు మల్లికార్జునస్వామి ఆలయంలో భ్రమరాంభ, మల్లికార్జున స్వామి కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. సందర్భంగా పలు గ్రామాల నుంచి భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

రెడ్డి సంఘం గ్రామ కార్యకర్గం

చొప్పదండి, ఏప్రిల్7: మండలంలోని గుమ్లాపూర్ రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆది వారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ముస్కు వెంకట్‌రెడ్డి, అప్పిడి శ్యాంసుందర్ రెడ్డి, వెల్మ బాపురెడ్డి, గుజ్జుల జగన్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా అల్లపు శ్రీనివాస్‌రెడ్డి, రూపురెడ్డి మనోహర్‌రెడ్డి, ఇనుకొండ మనోజ్‌రెడ్డి, అప్పిడి మధుసూదన్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా కూర్మాచలం రత్నాకర్, సావనపల్లి కృష్ణమచార్యులు వ్యవహరించారు.

ముస్లింలకు దుస్తుల పంపిణీ

హుజూరాబాద్, ఏప్రిల్ 7: రంజాన్ పండుగను పురస్కరించుకొని తెలంగాణ ముస్లిం ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ముజాహిద్ హుస్సేన్ ఆదివారం నిరుపేద ముస్లింలకు దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో అజీమ్, ఖాషమీయా, అలీం, గౌస్, ఖాన్, మురాద్ హుస్సేన్, సల్మాన్ పాల్గొన్నారు.

ఉక్కపోతతో ప్రజల అవస్థలు

వీణవంక, ఏప్రిల్ 7: మండలంలో రోజు రోజుకు ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతుండడంతో ఉక్కపోతతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. వీణవంకలో ఆదివారం 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వడగాల్పులతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు.

ప్రజాస్వామ్యన్ని గౌరవించే పార్టీకే ఓటు

జమ్మికుంట, ఏప్రిల్ 7: పార్లమెంటు ఎన్నికలలో మన ఓటును ప్రజలను , ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని గౌరవించే పార్టీలకే వేద్దామని మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముక్క ఐలయ్య అన్నారు. పట్టణంతో పాటు మండలంలో కరపత్రాలు ప్రజలకు అందజేశారు.